




# బచ్చన్ గారి బచ్చలి తైలం మరియు బుల్లి తెర భాషాదోషాలూ

## జరిగీ జరగని కథ:

(నేను ఎప్పుడు, ఏమి వ్రాసినా అందులో నిజంగా జరిగిన వ్యవహారం కొంత, నా స్వయంప్రకటిత పైత్య ప్రకోపం కొంతా ఉంటుంది అని చాలా మంది అంటూ ఉంటారు. అందుకే బావుంటుందని కొందరూ, తలా, తోకా లేకుండా నీ మొహంలా రాసి పారేస్తావు అని చాలా మందీ కూడా అంటూ ఉంటారు. కిందటి నెల అమెరికామెడిలో నిజంగా జరిగిన కథ ఏమిటంటే, నాకు గత క్రిస్మస్ సమయంలో వైర్‌లెస్ టీవీ శ్రవణ యంత్రం నాకు నిజంగానే మా పిల్లలు బహుమతి ఇవ్వడం. ఆ యంత్రాన్ని పరీక్షించే సమయంలో మన తెలుగు భాష కమర్షియల్ ప్రకటనల విషయాలలో గత ఐదారు శతాబ్దాలుగా మారలేదనియూ, కనుచూపు మేరలో ఆ భాషాదోషాలు మారవనియూ నేను విశ్వసించడానికి ప్రగాఢమైన కారణాలు ఈ నాటి టీవీలో ప్రతీ రోజూ కని. విని, మూర్ఛొనవచ్చు అనియూ నా ప్రతిపాదన. నేను ఎప్పుడు, ఏ విధంగానైనా, ఏ విషయంపైన అయినా క్వీన్ విక్టోరియా గురించి కానీ, ఆవిడ తాలూకు డైలాగులు కానీ, టెంకి జల్లలు లాటి చేష్టలు కానీ జరగని కథలు అనియూ, అసత్యములు అనియూ అని మనవి చేసుకుంటున్నాను. ముందు మాటలోనే ఇలా ఎందుకు స్పష్టంగా ప్రవచించ వలసి వచ్చిందో పాఠకులు ఊహించుకుని నవ్వుకోగలరు. ఇక చదవండి.)

ఇక నేను మా పిల్లలు నాకు బహూకరించిన శబ్ద శ్రవణ యంత్రం చెవులకి తగిలించుకుని, ఏస్ట్రోనాట్ సునీతా విలియమ్సు టైపులో ఫీలయిపోతూ , ధైర్యం పుంజుకుని తెలుగు టీవీ పెట్టగానే అమితాబ్ బచ్చన్ మహాశయుడు ఒక తెల్ల తివాసీ మీద శీర్షాసనం వేస్తూ....అంటే అతని పొడుగాటి కాళ్ళు గాలిలోనూ, నెరిసిపోయిన జుట్టుతో మెరిసిపోతున్న తల కార్పెట్ మీద విశ్రమిస్తూనూ కనపడ్డాడు. అయ్యో, పాపం అంతటి మహా నటుడూ దిక్కు తోచక ఇలా తలకిందులుగా ఎందుకు వేలాడుతున్నాడో అని కించిత్తు విచారంగా వాల్యూం పెంచేసి చూస్తుండగా, ఆయన అతి లాఘవంగా లేచి నిటారుగా నుంచుని, చేతిలో ఒక రంగు బాటిల్ పట్టుకుని ఇలా ప్రవచించారు. " ఇదిగో, వాడండి నూతన బచ్చలి తైలం, ఇదే అల్లమూ, ఇంగువా, మరియు కారప్పొడీ రంగరించి తయారి చేసిన జుట్టు పెంచే హెయిర్ ఆయిలు. పెరుగును మీ జుట్టే, నాది ఇక పెరగదు కదా. ఇక చూసుకోండి, పెరుగును మీ జుట్టు, అదుపు లేకుండా, మరియు రింగులు, రింగులు గా కూడా తిరుగును ఉంగరాలుగా... అమెరికా మరియు ఆముదాలవలసలో పేటెంటు పొందిన ఈ అద్భుత నూనె మీ అతి తెల్లని కార్పెట్ ను ఏ మాత్రమూ చేయదు మరక, గమనించండి, మీ జుట్టు పూర్తిగా రాలిపోయి, మీరు ధర ఖర్వాటుడిగా మారిపోయిన యడల వాపస్ మీ డబ్బు, వివరాలకు 58585 - గుండూ - కి ఎస్ యం ఎస్ చెయ్యండి" అంటూ తను అంతకు ఐదు క్షణాల ముందు తలకాయ మదుపు పెట్టిన తివాసీ కేసి చూపించాడు. అది ఇంకా అతి తెల్లగానే యుండుట నా అద్భుతమైన పరిజ్ఞానంతో గమనించాను. మా చిన్నప్పుడు కాకినాడ మ్యునిసిపల్ హైస్కూలులో యజ్జన్న శాస్త్రి గారు చెప్పిన తెలుగు గ్రామరు ప్రకారం ఈ వాక్యం అంతా శుద్ధ తప్పు. వ్యాకరణం మాట ఎలా ఉన్నా, బచ్చలి ఆకు, అల్లమూ, ఇంగువా, కారప్పొడీ కలిపిన పదార్ధాన్ని ఎవరైనా అన్నంలో కలుపుకుని తిన వచ్చునేమో కానీ, జుట్టుకు రాసుకునే రిస్కు తీసుకుంటారా? మీరే చెప్పండి. పోనీలే, అమితాబ్ బచ్చన్ అంతటి వాడు తెలుగు నేర్చుకుని సలహా ఇచ్చాడు కాబట్టి ఈ కేశవర్ధినీ తైలం బాగా రంగు వేసుకున్న జుట్టు గల నా

గాఢ మిత్రుడూ-గూఢ శత్రువులలో ఎవరో ఒకరికి వారి షష్టి పూర్తి సమయంలో నాలుగు బాటిల్స్ బహుమతి ఇచ్చేసి, వారి కేశాలంకరణ ఒక నెల పాటు తీవ్రంగా వీక్షించి ఎక్కడైనా బట్టతల ఏర్పడుతున్న సూచనలు, లేదా వాళ్ళింట్లో తెల్ల తివాసీ కి మరకలు కనపడగానే నా డబ్బు వాపస్ కి ఎస్.ఎం.యెస్ చేద్దాం అనే కోతి ఆలోచన కలుగుతూ ఉండగానే, వెంఠనే టీవీలో మరొక ప్రకటన వచ్చేసింది.

అందులో ఒక పదేళ్ళ కుర్రాడు , చొక్కా నిండా నల్ల మరకలతో డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని "మరక మంచిదే కదే, అమ్మా" అంటూ ఆనంద పడుతూ ఒక బట్టలు ఉతికే పౌడరు పేకెట్టు జేబులోంచి తీస్తాడు. అందులో ఆదివారం, సోమవారం ఇలా ఏడు రోజులకి ఏడు చిన్న సైజు పేకెట్లు ఉంటాయి. తివాసీ మరక అడ్వర్టయిజ్మెంట్కీ, ఈ బట్టల మరక కమర్షియల్ కీ భాషలో ఏ మాత్రం తేడా లేదు. ఎందుకంటే ఈ కుర్రాడి తల్లి ఐశ్వర్యా రాయ్ ఎంతో ఆనందంగా " అవును, కుర్ర వెధవా, నువ్వు బట్టల నిండా చేసుకున్నా ఎన్ని మరకలు, ఉతుకుతాను రోజూ బబ్బా బ్రాండు వారి అమోఘ సబ్బు పౌడరుతో, అది దొరకును కేవలం పది రూపాయలకే, వారానికి ఏడు రోజులూ హాయిగా ఉతుక్కోవచ్చు అత్యంత ఆనందంగా, అవును మరక మంచిదే, బాల వాక్కు బ్రహ్మ వాక్కే కదా!". వెనకాల అమితాబ్ బచ్చన్ గారి కుమారుడు మరియు ఆవిడ తాలూకు భర్త అజితాబ్ బచ్చన్ పిల్లాడి బట్టలు ఉతుకుతూ "మూడొస్తుందా, ముద్దిస్తుందా, మరో షూటింగుకి పోతుందా?" అని డౌటుగా పాట పాడుకుంటూ ఉంటాడు. ఆ బాలీవుడ్ జంటకి ఐదేళ్ళ కొడుకు పెళ్ళి అయిన ఏడాదిలోగానే పుట్టడం బాలీవుడ్ వింతల్లో వింత. ఏమంటారు?

ఇలా ఫేమస్ తారలు చెప్తున్నారు కాబట్టి, కొనకపోతే వాళ్ళేమైనా అనుకుంటారేమో అని ఈ తైలం బాటిల్స్ నాలుగూ, రెండు, మూడు వారాలకి సరిపడే బబ్బా బ్రాండు వారి "మరక మంచిదే" బట్టల పౌడరు, ఈ వారం గ్రోసరీ లిస్టులో రాయమని క్వీన్ విక్టోరియాకి చెప్పాలి సుమా నేను మెంటల్ నోట్ చేసుకుంటూ ఉండగా మూడో ప్రకటన అర్జంటుగా వచ్చేసింది.

ఇందులో ఇద్దరు, ముగ్గురు అందమైన అచ్చ తెలుగు ఇంపోర్టెడ్ తెలుగు సినిమా తారలు, బహుశా త్రిష, జెనీలియా, చార్మి లాటి వాళ్ళు అందరూ ఒకే సారి అర్ధనగ్నంగా స్నానం చేస్తూ ఉంటారు. క్షణా క్షణానికీ సీను మారిపోతోంది కాబట్టి వాళ్ళందరూ ఒకే బాత్ రూంలో మూక ఉమ్మడిగా జలకాడుతున్నారో లేదో స్పష్టంగా నాకు తెలియ లేదు. కానీ ఎవరికీ వీపు మీద కానీ, నాజూకుగా ఉన్న కాళ్ళ మీద కానీ, కనీ, కనపడని వక్షోజాల మీద కానీ, నేను ఎంత తీవ్రంగా చూసినా ఎక్కడా, ఏ విధమైన మరకలూ కనపడలేదు ఈ సారి. ఎటొచ్చీ వాళ్ళందరూ కూడా ఒకే రకమైన సబ్బుతో వళ్ళు తుడుచుకుంటూ, ఆనందిస్తూ ఉంటారు. అంతేకాక ఒకరి తరవాత ఒకరు ఏదో సువాసన అనుభవిస్తున్న అభినయం చేస్తూ ఉంటారు. ఇంతలో వెనకాల నుంచి "అనుభవించండి మీరు కూడా శుద్ధమైన చర్మ సౌందర్యమూ మరియూ ఎక్కువ ఖర్చు లేకుండా జీవిత కాలం. ఈ సుందర సబ్బులో రంగరించి ఉన్నవి తెల్లదనం కోసం పాలు, -ఆకర్షణ కోసం సున్ని పిండి, క్రిములని మర్డర్ చెయ్యడానికి పసుపు, అన్నీ అమెరికానుండి దిగుమతి చేయబడినవే మీ సౌందర్యం కోసం జీవితాంతం" అంటూ సాగుతుంది ఈ అడ్వర్టయిజ్మెంట్. నేను అనేక సంవత్సరాలుగా అమెరికాలో ఉంటున్నా, అప్పుడప్పుడు కుంకుడు కాయలు దొరకవచ్చునేమో కానీ, సున్నిపిండి ఎక్కడా కనపడలేదు. పైగా చిన్నప్పుడు మా గంగమ్మ, మంగమ్మ పండగల టైములో బలవంతాన చెరో చెయ్యీ ఘాటుగా పట్టుకుని కూచోబెట్టి కుంకుడు కాయలతో తలస్నానం చేయించినప్పుడు కళ్ళు మండిపోయి బాబోయ్ అంటూ ఏడ్చిన నాకు ఈ సుందరాంగులు అంత హాయిగా నవ్వుతూ ఈ సబ్బుతో స్నానం చేస్తుంటే అందులో నిజంగా కుంకుడు కాయలు కలిపారా, లేక మనకి చెవిలో పువ్వు బాపతా అని అనుమానం వచ్చేసింది నాకు. ఇక భాష అంటారా? వద్దు లెండి. ఏమీ అనకండి, ప్లీజ్.

మొత్తానికి నాటి నేటి వరకూ కమర్షియల్ వేషాలు మారినా ఏ మాత్రం మారనిది తెలుగు భాషే సుమా అనే నా అమూల్యమైన.....అంటే వేల్యూలెస్, అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారు కదా!. లేక పోతే నా ఖర్మ, అంతే కదా!

****